పోరాటం ఫలించింది

కొత్తూరు: అలికాం-బత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో ఐదేళ్లుగా మురుగునీరు రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు కొత్తూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమస్య పరిష్కారానికి వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పలుమార్లు రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించామని గుర్తు చేశారు. ఆందోళనకారులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినా వెనుకడుగు వేయకుండా పోరాటాలు చేశామన్నారు. దీని ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు రూ.26 లక్షలు మంజూరు చేసిందని, ఈ పోరాట ఫలితంగా విజయం సాధించామని అన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోరాటకాలంలో సహకరించిన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్దానం పనసకు

భలే గిరాకీ

- రోజుకు వెయ్యి టన్నుల ఎగుమతి
- తప్పని దళారుల బెడద
- ఆర్ఎస్‌కెల ద్వారా కొనుగోలుకు డిమాండ్

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతం అంటే ఎవరికైనా గుర్తొచ్చేది ఉద్యమాలు. అటువంటి ఉద్యమాల ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటలతో పాటు అంతర పంటగా పనస పండిస్తూంటారు. అటువంటి ఉదానంలో పండిన పనస పంట ఇతర దేశాలకు పెద్ద ఎత్తున విక్రయాలను పలాస కేంద్రంగా నిర్వహిస్తుంటారు. ఇతర ప్రాంతాల్లో లభ్యమయ్యే పనస కంటే ఉదానంలో పండే పనస ఎక్కువ రుచిగా ఉండడంతో ఈ ప్రాంతంలోని పనస ఇతర ప్రాంతాలలో ఎక్కువుగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం పనస కాయలు పంట సీజన్ ప్రారంభం కావడంతో ఉద్యానం పనస పలాస, కవిటి, కంచిలి. ఇచ్ఛాపురం, హరిపురం, సొంపేట కేంద్రాలుగా ఇతర రాష్ట్రాలకు లారీల్లో జోరుగా ఎగుమతులు జోరందుకున్నాయి. ఇక ధర విషయానికి వస్తే కాయలు సైజును బట్టి రూ.30 నుంచి రూ.35 వరకు కిలో ధరగా పలుకుతుంది. ఇక ఎగుమతులు విషయానికి వస్తే పలాస కేంద్రంగానే రోజుకు 50 టన్నుల నుంచి 100 టన్నుల వరకు పనసకాయలు ఎగుమతి అవుతుంది. కవిటి, కంచిలి, ఇచ్ఛాపుర, హరిపురం, సొంపేట కేంద్రాలుగా లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. జనవరి నుంచి ఏప్రిల్ నెల చివరి వరకు పనసకాయలు ఎగుమతులు అవుతున్నాయి.

జిల్లాలో 9 వేల ఎకరాల్లో పనస

జిల్లాలోని పలాస, మందస, వజ్రపుకొత్తూరు, కవిటి, కంచిలి, సోంపేట మండలాలతో పాటు ఇతర మండలాల్లో జీడి, కొబ్బరి పంటల్లో అంతర పంటగా 9 వేల ఎకరాల్లో పనస సాగుతోంది. ఎకరాలలో సుమారు 40 పనస చెట్లు ఉండగా సుమారు 50 నుంచి 100 కాయలు వరకు దిగుమతి వస్తుంది. ఒక్కొక్క కాయ సుమారు మూడు కేజీల వరకు బరువు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, పనస సాగుకు ఎకరాకు సుమారు పది వేలు ఖర్చు అవుతుందని, పంట దిగుబడి ప్రారంభంలో కేజీ రూ.35లు పలుకగా, ప్రస్తుతం రూ. 7 ధర తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లో డిమాండ్

ఉద్దానంలో పండే పనసకు కటక్, కోల్‌కత్తా, జార్ఖండ్, బరంపురం, గుజరాత్, బీహార్, ఒడిశా తదితర వంటి రాష్ట్రాల్లో మంచి గిరాకి ఉన్నట్లు తెలుస్తుంది. ఆయా ప్రాంతాల్లో పచ్చళ్ళు, పకోడి, రసం వంటి తయారు చేస్తుంటారు. అంతేకాకుండా పనసముక్కల బిర్యాని, పనసపొట్టు కూర, పనస పండు వాల్యా, పనసగింజలు కూర, పనసముక్కల గూనచారు. పనసకాయ కుర్మా వంటి వంటకాలను పనసకాయల ద్వారా తయారు చె స్తుండడంతో ఆయా ప్రాంతాల్లో పనసకాయలకు ఎక్కువుగా వినియోగం ఉండడంతో వ్యాపారులు ఇతర ప్రాంతాలను ఎగుమతి చేసి పెద్ద ఎత్తున పనసకాయల వ్యాపారం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు సుమారు రోజూ 50 నుంచి 100 టన్నుల వరకు పనస కాయలు ఎగుమతి అవుతున్నాయి.

ఆర్ఎస్‌కెల ద్వారా కొనుగోలు చేయాలి

పనసకాయలు దిగుబడి ఆశించిన మేరకు లభ్యమవుతున్నా దానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్రంగ నష్టపోవాల్సి వస్తుందని రైతులు లబోదిబోమంటున్నారు. పనసకాయలు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్న దళారులు అడిగినంత ధరకు ఇవ్వక తప్పడం లేదని అందువల్ల రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని రైతాంగం కోరుతుంది. ఉద్దానంలో పండే పంటలైన జీడి, కొబ్బరి, మునగ, పనసకు ఇంత వరకు గిట్టుబాటు ధర ప్రకటించిన సంఘటనలు లేకపోవడంతో ఉద్యాన పంటలు ప్రస్తుతం వ్యాపారులకు నచ్చిన ధరకు అమ్ముకొని నష్టాలను చవిచూడాల్సి వస్తుందని, ఇప్పటికే జీడి పంటపై పోరాటాలు చేసినా ఫలితం దక్కడం లేదని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన శాఖాధికారులు ఉద్దానం పంటలు, వాటిని పండించే రైతులు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటికి గిట్టుబాటు ధరలను ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతుంది.

పనస కాయలను కొనుగోలు చేస్తున్న దళారులు

ధర గణనీయంగా తగ్గిపోయింది

పనస కాయల ధర గణనీయంగా తగ్గిపోయింది. ప్రారంభంలో కేజీ రూ.35 ధర పలికిది. ప్రస్తుతం రూ.7లకు ధర పడిపోయింది. పనసకు పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కాయల ధర తగ్గి పోవడంతో చెట్లకే వదిలియాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– బత్తిన రాములమ్మ, చిన్నమాకన్నపల్లి

ఆర్ఎస్‌కెల ద్వారా కొనుగోలు చేయాలి

జీడి, కొబ్బరి తోటల్లో అంతర పంటగా ఉన్న పనస కాయలకు ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉంది. ఉద్దానం రైతులు పండించిన పనస కాయలను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తే మంచి ధర లభిస్తుంది. ఒక్కసారిగా ధర తగ్గి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– కుత్తుం గౌతమ్, మాకన్నపల్లి

కేంద్ర కమిటీలోకి లోకనాథం

విద్యార్థి ఉద్యమం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వైనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యునిగా జిల్లాకు చెందిన కొత్తపల్లి లోకనాథం ఎన్నికయ్యారు. తమిళనాడులోని మధురైలో ఆదివారం నిర్వహించిన సిపిఎం జాతీయ కమిటీ ఎన్నికల్లో ఆయనను సభ్యునిగా ఎన్నుకున్నారు. ఈయనది సోంపేట మండలం పాలవలస గ్రామం. ఈయన ఒకటి నుంచి ఏడో తరగతి వరకు పాలవలసలో, ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు సోంపేటలో చదివారు. చదువుతున్న రోజుల్లోనే డివైఎఫ్ఐలో చురుగ్గా పనిచేశారు. తర్వాత ప్రజానాట్య మండలిలో చేరి సేవలందించారు. కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. ఇంటర్ తర్వాత విశాఖలోని కృష్ణ కాలేజీలో డిగ్రీ చదువుతూ ఎస్ఎఫ్ఐ నాయకుడిగా పనిచేశారు. తరవాత సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి పనిచేశారు. ప్రస్తుతం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ... కేంద్ర కమిటీ సభ్యుని స్థాయి వరకు ఆయన ఎదిగారు.

లోకనాథం

హైటెక్ మోడల్‌గా మార్కెట్

- ఈ నెల 15న పునర్నిర్మాణానికి శ్రీకారం
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- గుజరాతీపేట

శ్రీకాకుళం నగర అభివృద్ధిలో భాగంగా పొట్టిశ్రీరాములు మార్కెట్ పునర్నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, నగర కార్పొరేషన్ పి.వి.వి.డి.కమిషనర్ ప్రసాదరావుతో కలిసి ఆదివారం మార్కెట్‌ను సందర్శించారు. అమ్మకందారులు, వినియోగదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు ఎలాంటి సలహాలు, ప్రణాళికలు లేకుండా నిర్మించిన పనికిరాని దుకాణాలు ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉండిపోయాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో అందరికీ ఉపయోగపడే విధంగా 'యు' ఆకారంలో నూతన మోడల్ మార్కెట్‌ను నిర్మించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఏప్రిల్ 15 నుంచి మార్కెట్‌ను ఖాళీ చేసి, పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. విశాల పార్కింగ్, ఆధునిక గోదాములు, మార్కెట్‌కు అవసరమైన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. నదీ పరివాహక ప్రాంతంగా ఉన్న ఈ నగరంలో పార్కులు, పరిశ్రమలు, రివర్ వ్యూ, పిపిపి మోడల్లో కొత్త బస్టాండ్, నూతన మున్సిపల్ కార్యాలయం వంటి పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నట్లు స్పష్టం చేశారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభిస్తామని వివరించారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు రప్పించి జిల్లాకు కొత్త రూపమి వ్వడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న మంత్రులు

తెలుగు వారి రుణం తీర్చుకోవాలి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రపంచ దేశాల్లోని తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్ఆర్ఐలు తెలుగు జాతి రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే రవికుమార్ డల్లాస్‌లో ఉన్న ఎన్ఆర్ఐలు ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ విశిష్టత అనే సమావేశంలో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి రూరల్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్స్ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి కేంద్ర మంత్రితో కొద్దిసేపు చర్చించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ అమెరికా దేశంలో తెలుగువారు భారతీయులు అన్ని రంగాల్లో ఉన్నతమైన స్థానాల్లో ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా వివిధ రంగాల్లో స్థిరపడిన తెలుగువారు తెలుగు రాష్ట్రాలతో పాటు భారతదేశంలో తమ స్థాయికి తగ్గట్టు పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి తెలుగుజాతి రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారథ్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆయన వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో ఎన్నారైలూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

కేంద్రమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

జిల్లా యూనిట్‌గా ఎస్‌సి వర్గీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం హేతుబద్ధీకరణ లేకుండా ఎస్‌సి వర్గీకరణకు సిద్ధపడడం సరికాదని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా మాల ఉద్యోగుల, పెన్షనర్ల ఐక్యవేదిక కన్వీనర్ పోతల దుర్గారావు అన్నారు. ఎస్‌సి వర్గీకరణ చేపట్టాలంటే రాష్ట్ర యూనిట్‌గా కాకుండా జిల్లా యూనిట్‌ను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో జిల్లా మాల ఉద్యోగుల, పెన్షనర్ల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ నిర్ణయంలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎస్‌సిల మధ్య చిచ్చురేపడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఎస్‌సి రిజర్వేషన్లపై సరైన ఇంపెరికల్ డేటా లేకుండా చేయడం, చట్టసభలైన అసెంబ్లీ, మండలిలో చర్చకు రానీకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారన్నారు. తప్పుడు సమాచారం ఆధారంగా వర్గీకరణ చేయడం చేశారని, దీనివల్ల కొన్ని తరగతులకు తీరని నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. జోనల్ స్థాయిలో ఏ విధంగా రిజర్వేషన్లు అమలు చేస్తారో బహిర్గతం చేయాలని కోరారు. వర్గీకరణ జరిగే విధానంలో లోపాలపై ఇంప్లీడ్ పిటిషన్లు వేసి వర్గీకరణ రద్దయ్యే వరకు న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు లింగాల అప్పన్న, అంపోలు ప్రతాపు, నూతన నూతలపాటి భరత్ భూషణ్‌రాజ్, దండాసి రాంబాబు, డి.రామప్పడు, ధర్మాన గణేష్, సీర రమేష్‌బాబు, పడాల ప్రతాప్‌కుమార్, కరగాన దామోదరరావు, కన్నేపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దుర్గారావు

10న 'కగార్'పై సదస్సు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ నెల 10న సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యాన గణపతి రెసిడెన్స్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు కాశీబుగ్గలో ఆదివారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు వత్తాసు పలుకుతూ అడవుల్లో ఉండే ఖనిజ సంపదను కట్టబెట్టే చర్యల్లో భాగంగా మావోయిస్టు పేరుతో ఆదివాసులను పోలీసులతో ఎన్‌కౌంటర్ చేయిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో చాపర వేణుగోపాల్, మద్దిల రామారావు, వంకల మాదవరావు, పత్రి దానేసు, కొర్రాయి నీలకంఠం, పుచ్చు దుర్యోధన మద్దిల ధర్మారావు, పోతనపల్లి వైకుంఠం, కుర్రాయి కొర్రాయి, జోగారావు మాస్టారు, సూరి పాపారావు, దాలయ్య గణపతి, సార జగన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకర్ పర్యటన

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బలగ, వరం కాలనీ, చాపురం పంచాయతీలోని పలు కాలనీలను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం పర్యటించారు. విస్తరించిన కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీలు లేక రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వివరించారు. వరం కాలనీలో పదేళ్ల క్రితం నిర్మించి రోడ్లు ఇప్పుడు గోతులుగా మారాయని, ప్రధానంగా మురుగునీటి కాలువకు గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో నిధులు ఇచ్చి పనులు ప్రారంభించిందని అన్నారు. ఆ తర్వాత మధ్యలోనే ఆ పనులు నిలిపి వేశారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనివల్ల మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోందని, దోమలు వస్తారంగా పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టేందుకు నగరపాలక సంస్థ కమిషనర్‌తో చర్చించి పనులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

వాణిజ్య తరహాలో సహకార బ్యాంకు సేవలు

- రబీ సీజన్‌లో రూ.650 కోట్ల పంట రుణాలు
- సిద్ధమవుతున్న ఖరీఫ్ రుణ ప్రణాళిక
- కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాణిజ్య బ్యాంకుల తరహాలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలు విస్తృత పరచడానికి అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని డిసిసిబి సిఇఒ దత్తి సత్యనారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పారదర్శకతను పెంపొందించేందుకు వీలుగా జిల్లాలోని అన్ని సహకార బ్యాంకు శాఖలను శతశాతం కంప్యూటరీకరణ పూర్తి చేసుకుంటున్నామన్నారు. కంప్యూటరీకరణ పూర్తయిన తర్వాత ప్రజలకు ప్రధానంగా రైతాంగానికి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. జిల్లాలోని 42 ప్రాథమిక వ్యవసాయశాఖ పరపతి సంఘాలనూ కంప్యూటరీకరణ పూర్తి చేశామని వివరించారు. దీనివల్ల అవినీతికి ఆస్కారం లేని సేవలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. సహకార రంగంలో రైతులకు ఎన్నో ప్రయోజనాలను చేకూర్చడం, సమగ్ర రుణ ప్రణాళిలను అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అందిస్తున్న సేవల్లో వాణిజ్య బ్యాంకుల కంటే సహకార బ్యాంకులపైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం సేవలను విస్తృత పరిచామని, రాష్ట్రంలోనే జిల్లా సహకార బ్యాంకును మోడల్ బ్యాంకుగా తీర్చిదిద్దామని చెప్పారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు విషయాలు వెల్లడించారు.

? ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి?

సహకార బ్యాంకు శతశాతం రైతు ప్రయోజనాలను కాపాడేందుకు ఆవిర్భవించింది. కేంద్ర సహకార చట్టం పరిధిలో బ్యాంకు నిర్వహిస్తున్నాం. బ్యాంకులకు అనుసంధానంగా ప్రాథమిక సహకార పరపతి సంఘాలు పనిచేస్తున్నాయి. సకాలంలో సాగుసమాయాన అధిక వడ్డీలకు రైతులు అప్పు చేయకుండా తోడ్పాటు అందిస్తున్నాం. ఖరీఫ్, రబీ సీజన్‌లో కూడా రైతులకు పంటరుణాలు అందిస్తున్నాం. ఎక్కడైన రుణాలు తిరిగి చెల్లించకుండా మొండి బకాయిదారులు ఉన్న చోట రుణాలు చెల్లించడం కొంత ఆలస్యం కావచ్చు. కానీ, మిగిలిన అన్ని బ్యాంకు శాఖలు పరపతి సంఘాల పరిధిలో రుణాలు మంజూరు చేస్తున్నాం. దీనికి తోడు వాణిజ్య, గ్రామీణ బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకు సేవలను విస్తృతం చేస్తున్నాం.

? సాంకేతిక మార్పులు ఎంతమేరకు అందుబాటు ఉన్నాయి?

వాణిజ్య, గ్రామీణ బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకు సేవలను విస్తృతం చేశాం. ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. బ్యాంకు ఖాతాదారులకు సౌకర్యాలను మెరుగుపరిచాం. ప్రతి సహకార బ్యాంకు పరిదిలో ఎటిఎం, మొబైల్ ఎటిఎం సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. డిజిటల్ అధారిత సేవల్లో సాంకేతికతను అనుసంధానం చేస్తున్నాం. అందులో భాగంగా వంద శాతం కంప్యూటరీకరణ చేట్టాం. ప్రాథమిక సహకార పరపతి సంఘాలను కంప్యూటరీకరించడంతో పారదర్శకత, అవినీతిని కట్టడి చేయడానికి వీలువుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. దీనికివల్ల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో బ్యాంకు సేవలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించారు. ఇప్పుడు శతశాతం ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నాం.

? రబీ సీజన్‌లో పంట రుణాలు లక్ష్యసాధన ఎంతమేరకు పూర్తి చేశారు?

జిల్లాలో రబీసాగు కొన్ని ప్రాంతాలకే పరిమితంగా ఉంటుంది. వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటలు, సాగునీరు అందుబాటులో ఉండే కొన్ని మండలాల్లో వరి సాగు చేస్తారు. రబీ సాగు చేస్తున్న రైతాంగానికి ఈ ఏడాది ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో రూ.650 కోట్ల పంట రుణాలు అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటికే 82 శాతం వరకు పంటరుణాలు మంజూరు చేశాం. మిగిలిన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయ రంగంతో పాటు వ్యవసాయేతర రంగాల్లో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సహకార బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తున్నాం. జిల్లా పారిశ్రామికాభివృద్ధి సాధించడంలోనే కేంద్ర సహకార బ్యాంకు తన వంతు పాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలో మోడల్ బ్యాంకుగా అభివృద్ధి చెందుతోంది.

? నూతన కేంద్రీయ సహకార విధానం అమలు ప్రబావం ఎలా ఉండబోతోంది?

సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి తోడ్పాటు అందిస్తోంది. ఇప్పటికే ఎన్‌సిసిటి స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ జిల్లాలో పర్యటించి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సహకార వ్యవస్థలోని బలహీనతలను, లోపాలను సరిదిద్ది సహకార సంస్థల ఆదాయ వనరులు పెంచుకుని ఆర్థిక స్వావలంబన దిశగా నడవడానికి నూతన కేంద్రీయ సహకార విధానాన్ని అమలు చేస్తున్నారు. సహకార వ్యవస్థ వనరులను దృష్టిలో పెట్టుకొని సేవలు అందించగలిగితే ఆర్థిక స్థాయి పెరుగుతుంది.

? ఇకెవైసి ఎంత మేరకు పూర్తయింది?

సహకార సంఘాల్లో ఒకే వ్యక్తి రెండు మూడు చోట్ల తమ భూములు ఉంటే అన్ని చోట్ల గతంలో సభ్యత్వాలు ఉండేవి. ఇటువంటి సభ్యత్వాల వల్ల కొన్ని పొరపాట్లకు తావుంటుందని భావించి ప్రభుత్వం సభ్యులందరికీ ఇకెవైసి తప్పని సరి చేసింది. దీంతో సభ్యులు తప్పనిసరిగా తమ సభ్యత్వానికి ఇకెవైసి అను సంధానించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాలు ఇచ్చే సమయంలో ఈ-క్రాప్ నమోదు చేశాం. దాని ఆధారంగానే సభ్యుల ఇకెవైసి చేపట్టాం. సచివాయాల్లో ప్రక్రియ చేపట్టాం. ఎక్కడైనా ఇకెవైసి చేయించుకోని రైతులు ఉన్నట్టయితే తప్పనిసరిగా సచివాలయాల్లోను, సహకార పరపతి సంఘాల సిబ్బందిని సంప్రదించాలి. సంఘాల పరిదిలో నకిలీ డాక్యుమెంట్లతో భూమి లేని వారూ సంఘాల్లో రుణాలు పొందడానికి వీలుండేది. ఇకెవైసి అనుసంధానం తర్వాత అటువంటి పొరపాట్లకు తావుండదు. ఇకెవైసి అనుసంధానించిన తర్వాత నేరుగా రైతు సెల్‌ఫోన్‌కే ఒటిపి వస్తుంది. ఆ ఒటిపి ఆధారంగా సభ్యులుగా డిజిటల్‌లో రిజిస్టరు అవుతున్నారు. భూములున్న రైతులు ఏదైనా కారణం చేత మృతి చెందితే వారి వారసులకు భూములు వారసత్వంగా సంక్రమిస్తాయి. మృతి చెందిన రైతులు మాత్రం ఇంకా సహకార సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. వారి స్థానంలో వారసులకు సభ్యత్వం మార్చుకునేందుకు వీలవుతుంది. భూములు క్రయవిక్రయాల తర్వాత మ్యూటేషన్ చేసుకోక, రికార్డుల్లో పేర్లు మార్పు కోని వారికి ఇది సమస్యగా ఉంటోంది. ఇటువంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇకెవైసి తప్పని సరిచేశాం.

తిరుపతిరావు మాస్టారుతో విద్యార్థులు

ఆకట్టుకున్న గణిత దశావధానం

ప్రజాశక్తి- సోంపేట

గణితంపైన ఆసక్తి రేకెత్తించుటకు గణిత దశావధాన కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కంచిలి మండలం బూరగాంకు చెందిన గణిత అవధాని మద్దు తిరుపతిరావు మాస్టార్ అన్నారు. సోంపేట పట్టణంలోని దుర్గా కోచింగ్ సెంటర్ ఆవరణలో డైరెక్టర్ గేదెల నీలాచలం అధ్యక్షతన గణిత అవధానం ఆద్యంతం ఆసక్తికరంగా నిర్వహించారు. విద్యార్థులు పృచ్ఛకులుగా వ్యవహరిస్తూ గణితంలోని వివిధ అంశాలైనా ఘన మూలాలు సమస్యా పూరణం, పంచమూలాలు, మనో సంకలనం, వారగణన దత్త దిన్నాంకం అంశాలపై అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో సమాధానాలు చెబుతూ అందరినీ అబ్బురపరిచారు. చివర చేసిన ధారణ అంటే కార్యక్రమం మొదటి నుంచి చివర వరకు అడిగిన ప్రశ్న జవాబులు గుర్తుపెట్టుకొని మరలా వరుసగా చెప్పడం అందరినీ ఆశ్చర్య పరిచింది. డైరెక్టర్ గేదెల నీలాచలం మాటలాడుతూ విద్యార్థులకు గణితంపైన ఉత్సుకతకు గణిత అవధానం ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం తిరుపతిరావును కోచింగ్ సెంటర్ యాజమాన్యం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాగేష్ సాహు, రాజేశ్, కళ్యాణ్, వాసుదేవ్, కిషోర్, లీలారాణి పాల్గొన్నారు.

చిత్రపటాన్ని స్వీకరిస్తున్న మాజీ మంత్రి సత్యనారాయణ

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మాజీ దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయనకు ఆలయ ఇఒ వై.భద్రాజీ స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే జిల్లాకు చెందిన రిటైర్డ్ ఎఎల వలివేటి శ్రీదేవి తన అన్నయ్య జయ రామారావు జ్ఞాపకార్థకం నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,001 విరాళం అందజేశారు. ఆలయ ఇఒ భద్రాజీని కలిసి చెక్కును అందజేశారు.

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చైత్రమాసం ఆదివారం, శ్రీరామ నవమి కారణంగా రద్దీ తగ్గింది. దీనివల్ల ఆదివారం రూ.2.81 లక్షల ఆదాయం మాత్రమే సమకూరినట్టు ఇఒ తెలిపారు. టికెట్టు విక్రయాల ద్వారా రూ.1,12,600, విరాళాల రూపంలో రూ.60521, ప్రసాద విక్రయాల ద్వారా రూ.1,15,880 ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు.

మరమ్మతులు చేస్తున్న బోరు మెకానిక్‌లు

బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గురుగుబిల్లిలో బోర్లు మరమ్మతుల పనులను ఆదివారం సర్పంచ్ బాడిత కళ్యాణి దగ్గరుండి చేయించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా బోర్ల మరమ్మతులు చేపట్టి అన్ని బోర్లును వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ పనులను సర్పంచ్ ప్రతినిధి బాడిత లక్ష్మణరావు దగ్గరుండి పర్యవేక్షణ చేపట్టారు. బోర్లు వినియోగంలోకి తీసుకురావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

విత్తన గుళికలతో మేలు

ప్రజాశక్తి- కవిటి

విత్తన గుళికలతో రైతుకు మేలని డిఎంఎంటి తులసయ్య తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తొలకరి వర్షాలు పడే ముందు వేసవిలో రైతులు విత్తన గుళికలు తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం వీటిని పొలాల్లో చల్లినట్లయితే ఇవి ఎండ తీవ్రతను తట్టుకొని తొలకరి వర్షాలు పడినప్పుడు భూమిలో తేమ శాతాన్ని పెంచుతాయని విత్తనాలు పొదుగుతాయని చెప్పారు. సాధారణంగా విత్తనాలు మొలకెత్తడానికి 22 నుంచి 25 శాతం వర్షపాతం అవసరమని, అదేవిత్తన గుళికలు వేయడంతో పది నుంచి పదిహేను శాతం వర్షపాతంతోనే విత్తనం మొలకెత్తడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి చిట్టిబాబు, ఐసిఆర్‌పి సంతోషి, లీడ్ ఫార్మర్ జయ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న తులసయ్య

తాగునీటి కష్టాలు తీరేనా..?

- గొంతు తడపలేని నీటి పథకాలు
- 10 రోజులకు ఒక్కసారి నీరు రావడం కష్టం
- మూడు దశాబ్దాలుగా ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- జి.సిగడాం

దూర ప్రాంతం నుంచి నీరు తెస్తున్న మహిళ

మండలం టంకాల దుగ్గి వలసలో తాగునీటి కోసం ప్రజలు అనేక కష్టాలు పడాల్సి వస్తుంది. వేసవి కావడంతో ఈ కష్టాలు మరింతగా పెరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే గ్రామస్తులు తాగునీటి కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తుందని, గ్రామానికి చుట్టూ వైపులా నీరు ఉన్నా... గ్రామంలోకి మాత్రం తాగునీరు రావడంలేదని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయితే వేసవి వచ్చిందంటే నీటి కొరత ఎక్కువగా ఉండడంతో ప్రజల దాహం కేకలు నిత్యం వినిపిస్తున్నాయి.

1980లో గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఆ ట్యాంకులు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్తిగా తాగునీరు రాని పరిస్థితి నెలకొంది. మళ్లీ 2007లో నాటి ప్రభుత్వం సుజలధార మిషన్ పేజ్-2 నుంచి వస్తున్న వాటర్ ప్రస్తుతం పైపుల నుంచి లీకవుతుండడంతో తాగునీరు కొంచెం కొంచెం మాత్రమే వస్తుంది. ఆ ట్యాంక్ నుంచి నీరు 10 రోజులకు ఒకసారి వస్తుంది. ఒక కుటుంబానికి కేవలం ఒక బిందె నీరు మాత్రమే పట్టుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ బిందెల నీరు పడితే గొడవలు పడాల్సిందే. ఇక వేసవి ఎండ రీత్యా తాగునీరు కోసం ప్రజలు రోడ్డు ఎక్కుతున్నారు. ప్రజల గొంతును తడపలేని మంచి నీటి పథకాలు ఎందుకని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి కనిపిస్తుంది. ప్రభుత్వం ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని గొప్పలు చెప్పుకుంటున్నా తమ గ్రామంలో మాత్రం తాగునీరు అందడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

2022లో గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ ద్వారా పైపులు వేసి గాలికి వదిలేశారు. ప్రస్తుతం ఆ పైపులు నుంచి నీరు రావడం లేదు. గతంలో వినియోగించే నేల బావులు, బోర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తాగు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. తాగునీరు అందించాలని గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు స్పందన కార్యక్రమంలో తమ గోడును విన్నవించుకున్నా పట్టించుకునే పాపాన పోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు గ్రామానికి వచ్చి తూతూ మంత్రంగా, చేతులు దులుపుకుని వెళ్లిపోతున్నారు. గ్రామానికి చెందిన యువకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెబితే మీరు ఫిర్యాదు చేసినా ఇలానే వచ్చి రిపోర్ట్ రాసి వెళ్ళిపోతామని మండల అధికారులు వెటకారంగా చెప్తున్నారని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు మాత్రం ఓట్లు కోసం వస్తారే తప్ప తాగునీటి సమస్యను సమస్యగానే గాలికి వదిలేశారని విమర్శిస్తున్నారు. తక్షణమే కలెక్టర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే స్పందించి గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు అందించాలి

తమ గ్రామానికి తాగునీటి కొరత విపరీతంగా ఉంది. 10 రోజులకు ఒక్కసారి తాగునీరు రావడం చాలా కష్టం. వాడుక నీరు నచ్చితే విడుదల చేస్తారు లేకుంటే చెయ్యరు. నిత్యం మంచి నీటి కోసం నరకం అనుభవిస్తున్నాం. పలుమార్లు జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- రావాడ శివరామకృష్ణ, టంకాల దుగ్గివలస

సాగునీటి సమస్యలపై వినతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని చిన్నమామిడిపల్లిలో నెలకొన్న సాగునీటి సమస్యలు పరిష్కరించాలని మామిడిపల్లి రైతు సంఘం, నీటి సంఘాల అధ్యక్షులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడిపల్లి గ్రామానికి జీవనాడి అయిన బుడబంద చెరువుకి పైనుంచి రావలసిన సునామిది కెనాల్ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విప్ స్పందించి సంబంధిత అధికారులతో మట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు జుత్తు సింహాచలం, నీటిపారుదల సంఘం అధ్యక్షులు దున్న వీరాస్వామి, గొరకల మన్మథరావు, తిమ్మల వీరాస్వామి, గేదెల కూర్మారావు, గేదెల జనార్ధనరావు, సంగారు చిరంజీవి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మండలంలోని చిన్నమామిడిపల్లిలో నూతనంగా నిర్మించనున్న తారు రోడ్డు పనులకు విప్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎర్రముక్కాంలో నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఇచ్ఛాపురం జనసేన దాసరి రాజు, మాజీ ఎంపిపి చిత్రాడ శ్రీను, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సూరాడ చంద్రమోహన్ పాల్గొన్నారు.

విద్యాసమస్యలపై సమీక్ష

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కంచిలి, సోంపేట మండల విద్యాశాఖ అధికారులతో, ఉపాధ్యాయులతో విద్యా సంబంధిత సమస్యలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల విలీనం, విద్యార్థుల హాజరు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర విద్యా సంబంధిత సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.శివరాంప్రసాద్, చిట్టిబాబు, జోరాడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న రాజు

మంత్రి నాదెండ్ల జన్మదినం

ఇచ్ఛాపురం : రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు డాక్టర్ గౌతమి సమక్షంలో పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రొక్కల భాస్కర్, నాగరాజు, శ్యామ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మెళియాపుట్టి : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇఒపిఆర్‌డి రామకృష్ణ అన్నారు. మండలంలోని పరశురాంపురం, టి.కె.ఆర్.పురం, నందువ, తోవూరు, కొత్తూరు, పెద్దమడి, హీరాపురం, పెద్దమడి కాలనీ తదితర గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై బస్సులు... తప్పని తిప్పలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కొజ్జిరియా కూడలిలో ఫ్లైఓవర్ రావడంతో దూరప్రాంత ప్రయాణికులకు తిప్పలు ప్రారంభమయ్యాయి. స్థానికులతో పాటు ఉద్దానం ప్రాంతం నుంచి చాలామంది ప్రయాణికులు కొజ్జిరియా కూడలికి చేరుకుని శ్రీకాకుళం, విశాఖపట్నం బస్సులకు వెళ్లేవారు. కానీ, ఫ్లైఓవర్ రావడంతో ప్రస్తుతం శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లే బస్సులు ఫ్లైఓవర్ పైనుంచే వెళ్లిపోతున్నాయి. దీంతో ఉద్దానం ప్రాంతం నుంచి చాలామంది ప్రయాణికులు అటు ఇచ్చాపురం, ఇటు సోంపేట వెళ్తుంటే స్థానికులు టోల్ గేట్ వద్దకు కానీ ఫ్లైఓవర్ చివరకు కానీ వెళ్లి బస్సుకు వెళ్తున్నారు. కేవలం పల్లె వెలుగు బస్సు తప్పించి ఎక్స్‌ప్రెస్ బస్సులు కొజ్జిరియా కూడలికి రావడం లేదని వారు వాపోతున్నారు.

ఫ్లైఓవర్ చివర ఎండలో వేచివున్న ప్రయాణికులు

అధికారులు స్పందించి మునుపటిలా ఎక్స్‌ప్రెస్ బస్సులు ఫ్లైఓవర్ దిగువ నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ఎండలో వేచివున్న ప్రయాణికులు

ఇబ్బంది పడుతున్నారు

ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ ఫ్లైఓవర్ పైనుంచే వెళ్లిపోతున్నాయి. దీంతో స్థానికులతో పాటు ఉద్దానం ప్రాంతం నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బ ందులు పడుతున్నారు. దిక్కులేక స్థానిక ప్రయాణికులు ఫ్లైఓవర్ చివర, టోల్ గేట్ వద్ద ఎండలో ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఫ్లైఓవర్ దిగువనుంచి వెళ్ళేలా చర్యలు చేపట్టాలి.

– జి.గణపతి, ఉప సర్పంచ్ ప్రతినిధి, కొజ్జిరియా

ఘనంగా సీతారామ కళ్యాణం

అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కోటబొమ్మాళి: మండలంలోగల నిమ్మాడ శ్రీరామ మందిరాన్ని వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివం ప్రసాద్, న్యాయవాది కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నారు. అలాగే మండలం ఊడికలపాడులో శ్రీరామక్షేత్రంలో సీతారామకళ్యాణ వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం ఐదు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సనపల కరుణ్‌కుమార్, గ్రామ పెద్దలు హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతిరావు, నేతింటి వెంకటరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రామ మందిరాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిటి రోడ్డులో ఉన్న ప్రధాన ఆలయంలో జరిగిన వేడుకల్లో స్వామి కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ జి.కాలనీ,పెదరెల్లి వీధి, పొట్టి శ్రీరాములు మార్కెట్, గూనపాలెం, మండలవీధి, అరసవల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న రామమవదిరాల్లో వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట కేంద్రంలో జట్టుకళాశీల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. అనంతరం జుట్టు కళాశీల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు దుశ్శాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కోటబొమ్మాళి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ రామాలయ విగ్రహాలను ప్రతిష్టించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఢిల్లీరావు, సహదేవ్, కామేశ్వరరావు, అంబటి ఈశ్వరరావు, బోర ప్రసాద్, బోర యువరాజ్, రాజారావు, అంబటి పురుషోత్తం పాల్గొన్నారు.

అలాగే స్థానిక శాంతి నికేతన్‌లో స్కూల్ చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించారు. వివిధలు వేసిన వివిధ పాత్రల అలంకరణ ఆకట్టుకుంది. విజేతలకు స్కూల్ సెక్రెటరీ డి.ఇందిరారెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శంకర్, శ్రీధర్, రవి, రోజా, యశోద, జయలక్ష్మి, మీనా, పార్వతి, ప్రమీల, సరోజ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, సుర్జిని, ఆంపురం, గొప్పిలి, చాపర, కోసమాల గ్రామల్లో శ్రీరామ నవమి సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్‌లోని శ్రీరామ నవమి సందర్భంగా వెంకటేశ్వర ఆలయాన్ని ఎస్‌పి జితేంద్రపండా సతీ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం గుమ్మా సమితి పరిడిపంచాయతీ తమరాడలో నిర్వహించిన రికార్డింగ్ డాన్స్‌లో మహిళలు వివస్త్రలై డాన్స్‌కు సంబంధించిన వీడియో వైరల్‌పై ప్రస్తావించారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని నువ్వలరేవు, పల్లిసారథి, పాతటెక్కలి, కొత్తపేట, అమలపాడు, గోవిందపురం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు.

పలాస : స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో సీతారామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఆర్‌డిఒ జి. వెంకటేష్, డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, తహశీల్దార్ టి. కళ్యాణచక్రవర్తి, ఎంపిడిఒ కె.వసంతకుమార్, సిఐ పి.సూర్యనారాయలు పాల్గొన్నారు.

కాశీబుగ్గ పల్లివీధికి చెందిన రామభక్తులు నర్సింహ మూర్తి తయారు చేసిన 25 అడుగుల భారీ అగరుబత్తి ఆకట్టుకుంది. సర్వే కర్రతో దీన్ని తయారు చేసి శ్రీరామనవమి సందర్భంగా దీన్ని వెలిగించారు. వినాయక మందిరం వద్ద ప్రత్యేక వేదికపై వెలిగించారు.

టెక్కలి రూరల్ : మండలంలోని సీతాపురంలో ఉన్న సీతారామంజనేయ ఆవరణలో శ్రీరామ నవమి సందర్భంగా మహిళలు కుంకమ పూజలు నిర్వహించారు.

ఆమదాలవలస : మండలంలోని లొద్దలపేటలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్న ప్రసాదాన్ని గ్రామానికి చెందిన శిగిలిపల్లి సన్యా సప్పారావు కుటుంబ సభ్యులు భక్తులకు అందజేశారు. కమిటీ సభ్యులు పైడి శ్రీనివాసరావు మజ్జిగ, పైడి యోగేశ్వరరావు పానకం పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్ ప్రారంభించారు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

హరిప్రసాద్

ఎచ్చెర్ల: వాళ్లిద్దరూ చిన్ననాటి స్నేహితులు శ్రీకాకుళం వెళ్లి పనులు ముగించుకొని ఎచ్చెర్ల వైపు ఇంటికి వస్తున్నారు. ఈలోపే మృత్యువు కభళించింది. ఆదివారం ఎచ్చెర్లలోని కేశవరావుపేట పంచాయతీ కింతలమిల్లు వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆ సంఘటనలో హరిప్రసాద్(21) డ్రైవింగ్ చేస్తుండగా వేణు వెనుక కూర్చున్నాడు. కింతలమిల్లు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న వ్యాను, లారీలను దాటే క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కిందపడిన వేణు కాళ్లపై నుంచి లారీ వెళ్లగా, హరిప్రసాద్‌ను లారీ బలంగా ఢీకొట్టంది. దీంతో అదే సమయంలో అదేదారిలో పక్కన వస్తున్న ఆర్‌టిసి బస్సు కిందకు తుళ్లి పడిపోడిపోయాడు. దీనిని గమనించి ఆర్‌టిసి డ్రైవర్ బస్సు అకస్మాత్తుగా నిలిపేశాడు. ఈ ప్రమాదంలో హరిప్రసాద్ అక్కడక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిని వేణును చికిత్స నిమిత్తం 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరించారు. హరిప్రసాద్ తల్లి రవణమ్మ కొన్నాళ్ల క్రితం తన భర్తతో విడాకులు తీసుకొని శ్రీకాకుళం నగరంలో ఓ బట్టల షాపులో పని చేస్తూ ఇద్దరు కుమారులతో జీవనం సాగిస్తుంది. ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

ఘనంగా లయన్స్ క్లబ్ సిల్వర్ జూబ్లీ

నరసన్నపేట : నరసన్నపేట మిలినియం లయన్స్ క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షులు సదాశివుని కృష్ణకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ సుబ్బరాజు, మాజీ డిజిలు రమేష్‌రాజు, వర్మ, ఆర్‌సివివి రంగనాథ్, మండల అధ్యక్షులు రమణ సాహు, కార్యదర్శి కె.సాయిరాం, కోశాధికారి కోరాడ బుజ్జి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఆమదాలవలస: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 8న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (క్యాంప్ కోర్ట్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొగరాం సెక్షన్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫారం చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. వినియోగదారులకు విద్యుత్‌పై ఎటువంటి సమస్యలున్నా నేరుగా తెలియజేసి పరిష్కారం పొందగలరని సూచించారు. క్యాంపు కోర్టు కార్యక్రమం అనంతరం ఆమదాలవలస మండలం తొగరంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాంపు కోర్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న కుమార్ నాయక్

సాహిత్యం సజీవం

ప్రజాశక్తి- పలాస

సాహిత్యాన్ని సజీవంగా ఉంచాలనే లక్ష్యంగా కవి సమ్మేళనం నిర్వహించామని జాన జాగృతి అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ అన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ ఆవరణలో జన జాగతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో ఉత్కలాంధ్ర కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తెలుగు రచయితల వేదిక అధ్యక్షులు ఉత్తరవల్లి నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ రీజన్ చైర్మన్ వెంకట రంగనాథం, కవి వంకల రాజారావు, సిందిరి మధుసూదనరావు, కోదండరామయ్యలకు దుశ్శాలు కప్పి సన్మానించారు. కుమారి భాష్యం లక్ష్య శాస్త్రీయ నృత్యాన్ని, బాలక లోకనాథం హాస్యవల్ల మంగలి దండాసి ఏకపాత్ర అభినయనం పలువురిని ఆకట్టుకుంది. కవి బమిడి సుబ్బారావు నిర్వహణ సారథ్యంలో సమకాలిన సామాజిక అంశంపై స్వీయ కవితా పటనం 34 మంది కవులతో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కోశాధికారులు హెచ్.వై.దొర, ఎన్.అప్పారావు, జన జాగృతి కార్యదర్శులు బి.బాలరాజు, ఉమామహేశ్వరి, భాష్యం రవి కుమార్, జయంతి గజలక్ష్మి, చిట్టిబాబు పాల్గొన్నారు.

నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

తాగునీరు సరఫరా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఎత్తైన అటవీ ప్రాంతంలో ఉన్న హడ్డివాడ గిరిజన గ్రామానికి తాగునీరు సమస్య ఏర్పడింది. సమస్యపై అధికారులు స్పందించారు. ఆదివారం వాటర్ ట్యాంకుతో తాగునీటినీ సరఫరా చేసినట్లు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా తెలిపారు.

బీమా తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

గజిబిజి జీవితాల్లో ఎప్పుడూ విధినిర్వహణలో ఉండే ఫొటోగ్రాఫర్లకు జీవిత బీమా తప్పనిసరిగా ఉండాలని ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడు పి.రాజశేఖర్ అన్నారు. కవిటి చింతామణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తపాలశాఖ ఆధ్వర్యాన ఉద్దానం ఫొటోగ్రాఫర్స్‌కి పోస్టల్ బీమాపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ఎన్నో ప్రయాణాలు చేస్తూ విధినిర్వహణలో ఉండే ఫొటోగ్రాఫర్లను గుర్తించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన తపాలశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు మండలాల ఫొటోగ్రాఫర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నరసింహామూర్తి, ఉపాధ్యక్షుడు గంతి శ్రీనివాస్, కార్యదర్శి ఆర్. నితిన్‌రాజ్ పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో వాహనాల నిలుపుదల

ఇక్కట్లు పడుతున్న వాహనదారులు, ప్రజలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ప్రైవేట్ వాహనాలు ఎక్కడికక్కడే రహదారిపై నిలిపివేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాత్రి లక్ష్మీనగర్ వీధిలో ఉన్న ఐసిఐసిఐ బ్యాంక్ ఎటిఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన సిఎంసి వాహనం లక్ష్మీనగర్ వీధి జంక్షన్ వద్ద నున్న ప్రధాన రహదారిపై అడ్డంగా నిలిపివేయడంతో పలువురు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం రహదారికి మధ్యలో సిఎంసి వాహనం, రహదారి చివరన ఆటోలు నిలిపివేయడంతో అటువైపుగా రాకపోకలు సాగించే పలువురు అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం ఇదే ఒరవడి కొనసాగు తుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కొంతమంది దుకాణ యజమానులు కూడా రహదారిపైనే సరుకు దిగుమతులు చేస్తూ గంటల తరబడి వాహనాల రాకపోకలకు విఘాతం కలిగిస్తున్నారని పలువురు వాపోతున్నారు. గతంలో ఉన్న పోలీసు అధికారుల హయాంలో పట్టణ శివారున ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నుంచి లారీలతో వచ్చిన సరుకును అక్కడ దిగుమతి చేసుకొని పికప్ వాహనాల ద్వారా గోదాములకు తీసుకువచ్చే వారిని ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలిగేది కాదని పలువురు గుర్తు చేస్తున్నారు. పట్టణంలో ఆటో స్టాండ్లు ఎక్కువ కావడంతో ఎక్కడపడితే అక్కడే రోడ్డు ప్రక్కన ఆటోలు నిలుపు చేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో వైఎస్‌ఆర్ కూడలి వద్ద, ఆర్‌టిసి కాంప్లెక్స్, అన్న క్యాంటీన్, రైల్వే స్టేషన్, లక్ష్మీనగర్ వీధి జంక్షన్, పాలపోలమ్మ గుడి ఎదురుగా ఆటో స్టాండ్లు ఉన్నాయి. ఇలా పలుచోట్ల పదుల సంఖ్యలో ఆటోలు ఎక్కడికక్కడే రహదారిపై నిలిపివేయడంతో అటువైపుగా రాకపోకలు సాగించే విద్యార్థులు, ప్రజలు, వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. ఒక్కోసారి పక్కకు తీయాలని భారీ వాహనదారులను ప్రజలు సూచిస్తే తమపై ఎదురుదాడి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పట్టణ పోలీసులు రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుని వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై అడ్డంగా నిలుపుదల చేసిన సిఎంసి వాహనం

యథేచ్ఛగా మట్టి, కంకర తవ్వకాలు

- పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులో యథేచ్ఛగా కంకర, మట్టి అక్రమంగా రోజు వందలాది ట్రాక్టర్లతో తరలి పోతుంది కళ్ల ముందే మట్టి తరలి పోతున్నా కనీసం రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎర్ర చెరువులో అక్రమంగా కొంతమంది జెసిబిలతో పట్టపగలే తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో తరలించి కాసులు కూడేస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ.500 నుంచి రూ.700 వరకు ధర పలుకుతుంది. దీంతో అక్రమంగా చెరువులో మట్టిని తవ్వేస్తూ తరలించి జేబులు నింపుకుంటున్నారు. లావేరు గ్రామం మధ్యలో వీధుల్లో నుంచి ట్రాక్టర్లుతో మట్టి తరలిస్తుండటంతో వీధుల్లో దుమ్మురేగుతూ ఇళ్లలో చేరిపోతూ ఇబ్బందులు పడుతున్నామని, ట్రాక్టర్లు వీధుల్లో తిరగడంతో చిన్న పిల్లలు వీధుల్లో తిరుగుతుంటారని ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని కొంత మంది తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా మండల రెవెన్యూ తాశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో చెరువులో మట్టి తరలించుకుపోతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం పట్టించు కోక పోవడంతో పలు విమర్శలు విని పిస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించి అక్రమంగా చెరువులో జెసిబిలతో తవ్వకాలు, ట్రాక్టర్లతో మట్టి, కంకర తరలింపు నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎర్ర చెరువులో జెసిబితో అక్రమంగా తవ్వుతున్న మట్టి

అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్